సాక్షి చిత్తూరు

బుధవారం । 24 । మే । 2023



ఆటకు వేళాయరా..!

ఏటా విద్యార్థులకు ప్రభుత్వం ఏటా శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడాపోటీలను ఈరోజు మంత్రి రోజా ప్రారంభించనున్నారు. - 8లో



పరిశ్రమలకు అవసరమైన భూములు సేకరించండి

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను సేకరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	28
తిరుపతి	41	28
తిరుమల	36	24
గూడూరు	43	31
నగరి	42	29

న్యూస్‌రీల్

24న విరాటపర్వం ప్రవచనాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం ఆలయ కల్యాణ వేదికలో బుధవారం తిరుపతికి చెందిన శ్రీ సాయి వారిచే విరాటపర్వం ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం భారతీయ సంస్కృతి సనాతన ధర్మపరిరక్షణార్థం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం విరాటపర్వం నిర్వహిస్తున్నామని చెప్పారు.

కర్ణాటకలోకి ఏనుగుల గుంపు



తిమ్మరాజుహళ్లిలో సంచరిస్తున్న ఏనుగులు

పలమనేరు: పలమనేరు కౌండిన్య అభయారణ్యంలో ఉన్న ఏనుగుల గుంపు మంగళవారం కర్ణాటకలోని తిమ్మరాజుహళ్లి ప్రాంతంలోకి వెళ్లింది. కౌండిన్య అడవిలోని ఏనుగులు దారి తప్పి కొత్త మార్గాల ద్వారా తోటకనుమనుంచి ఆ ప్రాంతానికి వెళ్లి అక్కడి రైతుల పంటలను నాశనం చేశాయి. గుంపులో దాదాపు 15 ఏనుగులు దాకా ఉన్నట్లు అక్కడి అటవీశాఖ అధికారులు తెలిపారు.

'జగనన్న ఆణిముత్యాలు' వాయిదా

చిత్తూరు కలెక్టరేట్ : తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు వాయిదా వేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్, విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఈనెల 25న నియోజకవర్గ, 27న నిర్వహించాల్సిన జిల్లాస్థాయి కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. పాఠశాలలు పునః ప్రారంభం అయిన తర్వాత తదుపరి తేదీని వెల్లడిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

నేడు రెండో విడత జగనన్న విద్యాదీవెన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్థాయిలో జగనన్న విద్యాదీవెన రెండో విడత కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులందరికీ ఆహ్వానం పంపినట్లు తెలిపారు. జిల్లాలో జగనన్న విద్యాదీవెన రెండవ విడతకు రూ.21.21 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 27,774 మంది అర్హులైన విద్యార్థులకు లబ్ధి కలగనున్నట్లు వెల్లడించారు.

దళారులను నమ్మవద్దు

చిత్తూరు కలెక్టరేట్ : విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టుల తాత్కాలిక జాబితాను విడుదల చేసినట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు (స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్) నిర్వహించడం జరుగుతోందన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితాను www.chittoor.ap.gov.in వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు. ఈ జాబితాను పరిశీలించుకుని ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలపాలన్నారు. పోస్టుల భర్తీ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, అభ్యర్థులు దళారులను నమ్మవద్దని సూచించారు.

వేధిస్తున్నారని వార్తలు రాయడం దుర్మార్గం



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: జిల్లాకేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో అధికారులను వేధిస్తున్నారంటూ ఓ పత్రికలో అక్కసు వెళ్లగక్కడం చాలా దారుణమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. పలమనేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జెడ్పీలోని కొందరు ఉద్యోగులు సరిగ్గా పని చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఇటీవలే తాము సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు ఏదైనా అత్యవసర పనులు ఉంటే అధికారులు, సిబ్బంది పని చేయాలని ఆదేశించిన మాట నిజమేనన్నారు. అయితే పనిభారం ఎక్కువైన కొంతమంది అధికారులు పచ్చ పత్రికల వారితో కుమ్మక్కై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పలమనేరు జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక రంగనాథం, పలమనేరు, గంగవరం మండలాల కన్వీనర్లు బాలాజీ నాయుడు, మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాపాడుతల్లీ.. గంగమ్మా..

కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులచే పిలవబడుతున్న కుప్పం తిరుపతి గంగమ్మ దర్శనం కోసం భక్తజనం భారీగా తరలి వచ్చారు.. దీంతో కుప్పంలో ఎటు చూసినా కనుచూపు మేర వీధులు జనసంద్రమయ్యాయి.. కాపాడుతల్లీ గంగమ్మ అంటూవేలగొంతులు నినదించాయి. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా కుప్పంతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా భక్తులు భారీగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



జన సందోహం మధ్య అమ్మవారి శిరస్సు

- అంబరాన్నంటిన కుప్పం గంగ జాతర
- కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగ విరాజిల్లుతున్న తిరుపతి గంగమ్మ
- ఏటా పెరుగుతున్న అమ్మవారి భక్తుల సంఖ్య
- అశేష భక్తజనంతో కిక్కిరిసిన కుప్పం పురవీధులు
- శిరస్సు తెర తొలగింపులో పాల్గొన్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం : శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఏటా మే నెల మూడవ మంగళవారం నిర్వహించే అమ్మవారికి శిరస్సు తెర తొలగించి ఊరేగించే తంతు ఈసారి కూడా ఘనంగా జరిగింది. ఉదయం ఆలయం నుంచి అమ్మవారి శిరస్సుకు తెరచుట్టి పెదబావి వద్దకు సంప్రదాయబద్ధంగా తీసుకువచ్చారు. అక్కడ పెదబావిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి కండ్ల తెర తొలగించారు. ఈ వేడుకను చూసేందుకు వేలాదిగా జనం రావడంతో కుప్పం కట్టపై జన ప్రవాహం నెలకొంది. అక్కడి నుంచి అమ్మవారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

మొక్కులు చెల్లింపు..

అమ్మవారి శిరస్సు పట్టణ పురవీధుల్లో ఊరేగుతుండగా, భక్తులు జంతు బలులతో పాటు సారె, పండ్లు, పూలు అమ్మవారికి సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఏటా అమ్మవారు భక్తుల కోరికలు తీరుస్తుండడంతో మొక్కులు తీర్చుకునే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. కుప్పంలో జరిగే ఈ తిరుపతి గంగమ్మ జాతరకు ఓ ప్రత్యేక ఉంది. కుప్పం మూడు రాష్ట్రాల కూడలిలో ఉండడంతో కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. మంగళవారం పెద్దఎత్తున జనం అమ్మవారి శిరస్సును దర్శనం చేసుకుని, కాపాడు తల్లీ గంగమ్మా అంటూ వేడుకున్నారు.

నేడు విశ్వరూపదర్శనం..

అమ్మవారి జాతరలో భాగంగా చివరి అంకం బుధవారం సాక్షాత్కారం కానుంది. ఊరేగింపు ముగించుకుని అమ్మవారి శిరస్సు ఆలయానికి చేరుకుంటుంది. అమ్మవారి మొండెంపై శిరస్సు ఉంచి అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని ప్రజలకు కల్పిస్తారు. ఈ తంతుతో జాతర ముగియనుంది. చివరి రోజు విశ్వరూప దర్శనానికి లక్షలాది మంది జనం వచ్చి దర్శించుకోనున్నారు. భక్తులు అమ్మవారి వేషం, ఇతర వేషధారణతో మొక్కులు చెల్లించుకోనున్నారు. వీరికి ఎక్కడా ఆటంకాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. విశ్వరూప దర్శనం అనంతరం అమ్మవారిని బుధవారం రాత్రి 12 గంటలకు జలప్రవేశం చేయించి జాతర ముగిస్తారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ..

పెదబావి వద్ద అమ్మవారి శిరస్సు తెర తొలగింపు కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తెర తొలగింపును తిలకించారు. ఈ సందర్భంగా కుప్పం జనాన్ని చల్లగా చూడాలని భరత్ అమ్మవారిని వేడుకున్నారు. ఆయనతో పాటు రెస్కో చైర్మన్ సెంథిల్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, గంగమ్మగుడి చైర్మన్ మంజునాథ్‌తో పాటు పెద్దఎత్తున నాయకులు పాల్గొన్నారు.



తెర తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ భరత్

గృహప్రవేశాలకు సిద్ధంకండి

- జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్
- జూన్‌లోపు పనులు పూర్తిచేయాలని ఆదేశం
- జూలై మొదటి వారంలో గృహ ప్రవేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, చిత్తూరు: చిత్తూరు జిల్లా పరిధిలోని మున్సిపాలిటీ, అర్బన్ పరిధిలోని నిర్మించిన టిడ్కో ఇళ్లకు జూలై మొదటివారంలో గృహప్రవేశాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. ఇందుకోసం సంబంధిత శాఖలు అవసరమైన అన్ని పనులు నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి శిక్షణ కలెక్టర్ మేఘ స్వరూప్‌తో కలిసి చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, నగరి, మున్సిపల్ కమిషనర్లు, టిడ్కో అధికారులతో టిడ్కో లేవుట్లలో జరుగుతున్న పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవరత్నాల పథకంలో భాగంగా పేదలకు ఇళ్లు మంజూరు చేసిందన్నారు. అర్హులందరికీ అవి చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. టిడ్కో లేవుట్లలో రోడ్లు, అప్రోచ్ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, బోర్లు, విద్యుత్తు వంటి మౌలిక సౌకర్యాలను జూన్ చివరిలోపు పూర్తిచేసి, జూలై మొదటి వారంలో గృహప్రవేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు వారానికి రెండుసార్లు టిడ్కో లేఅవుట్లను సందర్శించాలని, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించాలన్నారు. టిడ్కో ఈఈ వెంకటముని పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న చేస్తున్న దృశ్యం

వడమాలపేట : అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రిని నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్రజలాలను ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం 11.30 గంటలకు భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమార్ ఆచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో ప్రజాప్రతినిధుల భేటీ



కలెక్టర్‌తో చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : పలువురు ప్రజాప్రతినిధులు మంగళవారం కలెక్టర్ షణ్మోహన్‌తో భేటీ అయ్యారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు రాజేష్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి కలెక్టర్ కలసి పలు అంశాలపై చర్చించారు.

విత్తన కాయలు వచ్చేశాయ్..!

ఖరీఫ్‌లో సాగు చేసేందుకు జిల్లాకు రాయితీపై వేరుశనగ కాయలు వచ్చాయి. రాష్ట్రప్రభుత్వం 42,350 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించింది. ఇప్పటికే పలు ఆర్బీకేలకు కాయలు చేరాయి. అధికారులు కూడా కాయల పంపిణీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నేటి(బుధవారం) నుంచి ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని సమయాత్తమయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నెలాఖరుకు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో పంటలసాగుకు పెట్టుబడి నిధిని కూడా జమ చేయనుంది.

- నేటి నుంచి జిల్లాలో వేరుశనగ విత్తనకాయల పంపిణీ
- జిల్లాకు 42,350 క్వింటాళ్ల కాయలు
- విస్తీర్ణాన్ని బట్టి రైతుకు ఒకటి, రెండు బ్యాగుల చొప్పున అందజేత
- ఈ నెలాఖరుకు రైతు భరోసా నగదు జమయ్యే అవకాశం



చిత్తూరుకు సరఫరా అయిన వేరుశనగ కాయలు

చిత్తూరు రూరల్: జిల్లాలో వర్షాధార పంటగా వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. గతేడాది సాధారణ విస్తీర్ణం 55,650 హెక్టార్లు కాగా 33,897 హెక్టార్లలో పంట సాగైంది. ఇందుకు గానూ గత ఖరీఫ్‌కు రాష్ట్రప్రభుత్వం 42,500 క్వింటాళ్ల విత్తనాలను అందించింది. ప్రతి రైతుకు రెండు నుంచి మూడు బ్యాగుల వరకు కాయలు పంపిణీ చేసింది. ఈసారి కూడా రైతులకు అవసరమైన మేర కాయలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. వేరుశనగ సాధారణ విస్తీర్ణం ఈ ఏడాది 51,266 హెక్టార్లు కాగా 42,350 క్వింటాళ్ల వేరుశనగ కాయలు కేటాయించారు. కే-6, నారాయణి రకం వంటి విత్తన కాయలను తెప్పించారు. ఇప్పటివరకు కే-6 రకం 23 వేల క్వింటాళ్లు రాగా నారాయణి రకం విత్తనాలు 1,773 క్వింటాళ్లు వచ్చాయి. మిగిలినవి ఈనెల 26వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో జిల్లాకు చేరుకోనున్నాయి. ప్రభుత్వం 40 శాతం రాయితీతో ఈ విత్తనాలను రైతులకు పంపిణీ చేయనుంది. దీంతో పాటు పచ్చిరొట్టె విత్తనాలు 1,394 క్వింటాళ్లకు గానూ 1,316 క్వింటాళ్లు ఆర్బీకేలకు చేరాయి. ఇందులో జనుము 945 క్వింటాళ్లు, జీలుగ 357 క్వింటాళ్లు, పిల్లిపెసర 17 క్వింటాళ్లు ఆర్బీకేల్లో నిల్వలు ఉన్నాయి. వీటిని 50 శాతం రాయితీతో ప్రభుత్వం రైతులకు అందించనుంది.

పకడ్బందీగా పంపిణీ..

జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా కాయల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో చాలాచోట్ల కాయలు దింపి పంపిణీకి రంగం సిద్ధం చేశారు. రైతు భూవిస్తీర్ణం, క్రాప్‌బుకింగ్ ఆధారంగా రైతులకు ఒకటి నుంచి రెండు బ్యాగుల వరకు మాత్రమే విత్తనాలను అందించనున్నామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. గత ఖరీఫ్‌లో విత్తనకాయలు తీసుకున్న చాలామంది నూనె ఆడించుకున్నారు. ఈవిషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో ఈసారి అలాంటి జరగకుండా చూస్తున్నారు.

విత్తన ధరలు ఇలా..

ప్రభుత్వ రాయితీ పోనూ వేరుశనగ కే6 రకం బ్యాగు (30 కేజీలు) రూ.1,674లకు, నారాయణి రూ.1,773లకు అందించనుంది. జీలుగ కేజీ రూ.39, జనుము రూ.42, పిల్లిపెసర రూ.48.50లకు ఇవ్వనున్నారు. రైతులు ఈ విత్తన ధరలను గుర్తించాలని అధికారులు అంటున్నారు. ఈసారి ఖరీఫ్‌కు వరుణుడు కూడా సహకరిస్తున్నాడు. జిల్లాలో గత ఏప్రిల్‌లో సాధారణ వర్షపాతం 19.05 మి.మీ అయితే 27.05 మి.మీ నమోదైంది. మే నెలలో ఇప్పటివరకు 67.02 మి.మీ ఉంటే 105.04 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని కార్వేటినగరం, నగరి, వరదయ్యపాళెం తదితర మండలాల్లో 99 హెక్టార్లలో వేరుశనగ సాగైంది.

తోడుగా రైతు భరోసా నిధి..

ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక ఖరీఫ్ నెల ప్రారంభంలోనే రాయితీ విత్తనాలు అందించడంతో పాటు అదునుకు రైతు భరోసా నిధులను జమ చేస్తోంది. ఈసారి కూడా ఈ నెలాఖరుకు రైతు భరోసా నిధి జిల్లావ్యాప్తంగా 2,23,092 మంది రైతుల ఖాతాల్లో రూ.166.64 కోట్ల వరకు జమ కావొచ్చని అధికారులు చెబుతున్నారు.

విత్తు వేయాల్సిందే..



జిల్లావ్యాప్తంగా రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనకాయల పంపిణీ చేయడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నాం. అన్ని ఆర్బీకేల బుధవారం నుంచి కాయలు పంపిణీ ప్రారంభమవుతుంది. కాయలు తీసుకున్న రైతు కచ్చితంగా విత్తు వేసి చూపించాలి. క్రాప్ బుకింగ్ చేస్తాం. అలాంటప్పుడు విత్తు లేదంటే ప్రభుత్వ పథకాల నుంచి కోత పడుతుంది. జిల్లాలో వేరుశనగ సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నదే తమ ముఖ్య ఉద్దేశం.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

అగ్నికి ఆహుతైన చెట్లు


టి.పుత్తూరులో కాలిపోయిన మామిడి, అరటి, టేకు చెట్లు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు సమీపంలోని పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు, అరటితో పాటు టేకు చెట్లు, పొలంలో పంటలకు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసి డ్రిప్ పైపులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. టి.పుత్తూరుకు చెందిన రైతు కిషోర్‌కుమార్ రెడ్డి పొలంలో మామిడి, అరటి, టేకు చెట్లు ఏపుగా పెరిగాయి. మామిడిచెట్లు కాయలతో, అరటి చెట్లు గెలలతో ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు వీటికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి చెట్లు కాలిపోయాయి. రైతు పొలం వద్దకు వెళ్లి చూడగా బూడిద కావడంతో తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. దీనిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు. వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు


గాయపడిన బాలుడు

రామకుప్పం: మండలంలోని బిరుగుండ్లపల్లి గ్రామంలో మంగళవారం కుక్క దాడి చేయడంతో ఓ బాలుడు గాయాలపాలైన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. వివరాలు.. మంగళవారం ఉదయం లక్ష్మణ రెడ్డి(10) తన ఇంటి ముందు ఆడుకుంటుండగా అకస్మాత్తుగా ఓ కుక్క బాలుడిపై దాడి చేసింది. దీంతో బాలుడి ఛాతి, కుడి భుజంపై, రెండు చేతులకు గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు హుటాహుటిన రామకుప్పం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాలున్ని 108 వాహనం ద్వారా కుప్పం ఆస్పత్రికి తరలించారు.

ఆటకు వేళాయరా..!

వేసవి సెలవుల్లో విద్యార్థులంతా క్రీడా మైదానాల్లో వాలిపోతారు. ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా ఆటల్లో మునిగిపోతారు. అయితే వారిలోని క్రీడా ప్రతిభ ఉన్నవారిని గుర్తించి వెలుగులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా శాప్ ఆధ్వర్యంలో వేసవిలో ఉచిత క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

- క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం
- ఈ ఏడాది సమ్మర్ క్యాంపు నిర్వహణకు రంగం సిద్ధం
- నేడు మంత్రి రోజా చేతుల మీదుగా శిక్షణా శిబిరం ప్రారంభం


నూతన రంగులతో కళకళలాడుతున్న కేవీకే క్రీడా ప్రాంగణ భవనం

నగరి : ప్రభుత్వం ఏటా నిర్వహించే వేసవి శిక్షణకు ఈ ఏడాది కూడా నగరి స్థానిక క్రీడా వికాస కేంద్రం (కేవీకే) మైదానం కొత్త హంగులతో సిద్ధమైంది. క్రీడాకారుల కోసం మంత్రి ఆర్కేరోజా ప్రత్యేక చొరవ చూపడంతో నూతన రంగులతో కేవీకే క్రీడాప్రాంగణం కళకళలాడుతోంది. శిక్షణకు తగిన విధంగా క్రికెట్ నెట్ ప్రాక్టీస్ పిచ్, హ్యాండ్ బాల్ కోర్టు, ఇండోర్ టెన్నిస్ కోర్టు, టేబుల్ టెన్నిస్ కోర్టు, చెస్, క్యారంబోర్డు రూమ్స్ ప్రత్యేక హంగులతో సిద్ధం చేశారు. దీంతో క్రీడా మైదానం క్రీడాకారులను స్వాగతిస్తోంది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, వ్యాయామ క్రీడలు, జిమ్, కరాటే, కబడ్డీ, చెస్, యోగా, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో నియోజకవర్గంలోని విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నారు. చదువుల్లో అలసిన విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఈ క్రీడా శిక్షణ శిబిరాలు శిక్షణతో పాటు ఆనందాన్ని కలిగించనున్నాయి. శిక్షణతో పాటు గ్రామీణ స్థాయిలో నైపుణ్యం గల క్రీడాకారులను గుర్తించి వారికి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయనున్నారు. బుధవారం ప్రారంభమయ్యే ఈ క్యాంప్ జూన్ 7వ తేదీ వరకు కొనసాగనుంది.

నేడు శిక్షణ శిబిరాలు ప్రారంభం

వేసవి క్రీడా శిబిరాన్ని బుధవారం ఉదయం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ప్రారంభిస్తారు. అనంతరం క్రీడాకారులకు శిక్షణా శిబిరాలు ప్రారంభం అవుతాయి. అలాగే రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా మంత్రి ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో టాపర్లకు పురస్కార, ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు.


చెస్, క్యారంబోర్డు ఆడేందుకు సిద్ధం చేసిన టేబుళ్లు

ఉచిత శిక్షణకు నియమించిన కోచ్‌లు

క్రీడ	పేరు	పనిచేసే పాఠశాల
వాలీబాల్	గీత	పీసీఎన్ హైస్కూల్, నగరి
క్రికెట్	ఎస్.బాబు, సాప్ కోచ్	
	ఎస్‌ఎం లోకనాథం	జెడ్పీహెచ్‌ఎస్, తీర్థం
బ్యాడ్మింటన్	ఎస్‌ఆర్ మణి	జెడ్పీహెచ్‌ఎస్, విజలాపురం
హ్యాండ్‌బాల్	వి.సురేష్‌బాబు	ప్రభుత్వ పాఠశాల, కార్వేటినగరం
బాల్‌బ్యాడ్మింటన్	డి.గోపి	జెడ్పీహెచ్‌ఎస్, జంబాడ
యోగా	నాగామృత	యోగా కోచ్, నగరి
కబడ్డీ	చెన్నకేశవరెడ్డి	జెడ్పీహెచ్‌ఎస్, నాగరాజకుప్పం
టేబుల్ టెన్నిస్	ఎస్‌ఎం లోకనాథం	జెడ్పీహెచ్‌ఎస్, తీర్థం
కరాటే	విజయ్, బాలాజి	కరాటే కోచ్‌లు, నగరి



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,665
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.74,000
రిటైల్ వెండి గ్రాము రూ.77

జూదరుల అరెస్ట్

పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరు ఉర్దూ పాఠశాల ఆవరణలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు పెద్ద పంజాణి గ్రామానికి చెందిన నలుగురు నలుగురు పేకాట ఆడుతుండగా అరెస్టు చేసి, అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1030 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

గంజాయి కేసులో మహిళ అరెస్టు

తొట్టంబేడు(రేణిగుంట): పట్టణంలోని వీఎంపల్లెకు చెందిన కె.సాయమ్మ(65)ను గంజాయి కేసులో మంగళవారం అరెస్టు చేసినట్లు టుటౌన్ సీఐ మల్లికార్జున తెలిపారు. రహస్య సమాచారం మేరకు గంజాయి అమ్ముతున్న ఆమెను అరెస్టు చేసి, 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కూలి కోసం వచ్చి..


తేజశ్రీ మృతదేహం

పూతలపట్టు: కూలి పనుల కోసం వచ్చి కన్నకూతురిని కోల్పోయిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలంలోని ఈసమానువడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ పూతలపట్టు మండలం తిమ్మిరెడ్డిపల్లిలోని ఓ ఫ్యాక్టరీలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం వెంకటేష్ తప్పా మిగతా కుటుంబ సభ్యులంతా స్వగ్రామం నుంచి లారీలో తిమ్మిరెడ్డిపల్లికి వచ్చారు. ఉదయం 10.45 గంటలకు వెంకటేష్ కూతురు తేజశ్రీ నాగలేఖ(6) జాతీయ రహదారి దాటుతుండగా చిత్తూరు నుంచి కడపకు వెళ్తున్న ఏపీ03టీఎన్1459 నంబరు గల కారు వేగంగా దూసుకొచ్చి ఢీకొనడంతో చిన్నారి అక్కడికక్కడే చనిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

చిత్తూరు అర్బన్: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ డా.అరుణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 25వ డివిజన్ సచివాలయ కార్యదర్శి ఎం.పూర్ణచంద్ర గతంలో ఒకసారి సస్పెండ్ అయ్యాడు. అయినా ఇతని పనితీరులో మార్పు లేకపోవడంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. అలాగే కార్పొరేషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.రాహిత్య సైతం సంస్థకు చెడ్డ పేరు తీసుకొస్తుండడంతో ఆమెను సైతం విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

పెత్తందారులపై గెలుపునకు నాలుగేళ్లు

- రైతుల కోసం చంద్రబాబు ఏ చేశారో చెప్పాలి ?
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఫైర్


విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : పెత్తందారుల బానిస సంకెళ్ల నుంచి ప్రజలను విముక్తులను చేస్తూ నాలుగేళ్ల కిందట సీఎం జగన్ అధికారంలోకి వచ్చారని, పెత్తందారులపై గెలుపునకు నాలుగేళ్లు అయిందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్ల కిందట ఇదే రోజు అధికారాన్ని దక్కించుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో 98.4 శాతం ఎన్నికల హామీలను నెరవేర్చిందని తెలిపారు. పేదలను బలపరిస్తే సమాజం, ప్రాంతాలను బలపరిస్తే రాష్ట్రం బాగుంటుందని జగనన్న నమ్మి ఆచరించారన్నారు. చంద్రబాబు నాయుడు, ఎల్లో మీడియా, దత్తపుత్రుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతిలో పేదవారు ఇల్లు కట్టుకోకూడదా ? పెత్తందారులే నివసించాలా అని ప్రశ్నించారు. ఆర్–5 జోన్‌లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. పేదలకు ఇచ్చిన భూమిని శ్మశానంతో పోల్చిన చంద్రబాబు, నీకు మరో జన్మలో కూడా పుట్టగతులు ఉండవన్నారు. చంద్రబాబు తన హయాంలో పేదలకు ఎక్కడైనా సెంటు భూమి ఇచ్చారా అని ప్రశ్నించారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని, అతను సీఎంగా ఉన్నప్పుడు ఏనాడైనా వర్షాలు పడ్డాయా? అన్నారు. ఈ నాలుగేళ్ల జగనన్న పాలనలో వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయని, రైతులు ఆనందంగా పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం అందించామన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే మళ్లీ జగనన్నే రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. మరోసారి ప్రజలు మోసపోవడానికి సిద్ధంగా లేరని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని బంగాళాఖాతంలో కలవడం ఖాయమని పునరుద్ఘాటించారు.

వినాయకుని సేవలో కేంద్రమంత్రి


కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కేంద్ర వ్యవసాయశాఖ, రైతు సంక్షేమ సహాయ మంత్రి శోభా కరంద్లాజే దర్శించుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆమె స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, ఎస్‌ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ మారుమూరు గ్రామానికి చెందిన జయప్ప, గురుస్వామి వారి అనుచరులతో కలసి మంగళవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలన నచ్చే తాము ఆనందంగా వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందుస్వామి, ఎంపీటీసీ మేనక, నాయకులు మనోజ్‌రెడ్డి, వీరభద్ర, రత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి


గాయపడ్డ శంకర

మదనపల్లె(అన్నమయ్య జిల్లా): అమ్మాయిని వేధిస్తుండడంతో మందలించినందుకు ఓ వ్యక్తిపై మూకుమ్మడిగా కొందరు కర్రలతో దాడి చేసిన సంఘటన పుంగనూరు మండలంలో జరిగింది. బరినేపల్లెకు చెందిన పి.శంకర(37) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన సోదరి కొంతకాలం క్రితం మృతిచెందడంతో ఆమె కుమార్తె భారతిని తన వద్దే ఉంచుకుని చదివిస్తున్నాడు. అయితే అదే గ్రామానికి చెందిన మురుగేష్ కొద్ది రోజులుగా భారతి వెంటపడుతూ ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. మురుగేష్‌ను పలుమార్లు శంకర మందలించి, అతడి తల్లిదండ్రులకు సైతం చెప్పినా పద్ధతి మార్చుకోలేదు. యథావిధిగా మంగళవారం మురుగేష్.. భారతిని వేధించడంతో శంకర అతడిపై చేయిచేసుకున్నాడు. దీంతో ఆవేశానికి గురైన మురుగేష్, అతడి కుటుంబ సభ్యులు శంకర్‌పై మూకుమ్మడిగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. బాధిత కుటుంబీకులు శంకరను 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారాన్ని అవుట్‌పోస్ట్ సిబ్బంది పుంగనూరు పోలీసులకు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో మామిడిచెట్లు దగ్ధం


కాలిపోయిన మామిడిచెట్లు

యాదమరి: మండలంలోని 12 కమ్మపల్లె గ్రామంలో రైతు దినకర్ పిళ్లైకు చెందిన మామిడి చెట్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయ్యాయి. రైతు తెలిపిన వివరాల మేరకు.. మామిడి చెట్లు మధ్యలో వరిగడ్డి ఉందని, అయితే పైన ఉన్న విద్యుత్ వైర్లు వేకువజామున మెల్ట్ కావడంతో నిప్పు రవ్వలు వరిగడ్డిపై పడ్డాయి. దీంతో మంటలు వ్యాపించాయని, పొలానికి వచ్చి చూసే సరికి ఎకరాలో మామిడి చెట్లు, వరిగడ్డి పూర్తిగా కాలిపోయిందన్నారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు.

పరిశ్రమలకు అవసరమైన భూములు సేకరించండి

- జిల్లాలో 101 పాలసేకరణ కేంద్రాలు
- పలు శాఖల అధికారుల సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పుంగనూరు, పలమనేరు ప్రాంతాల్లో నూతన పరిశ్రమలు ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. ఆ పరిశ్రమల ఏర్పాటుకు 2 వేల ఎకరాల భూమి అవసరం ఉంటుందన్నారు. జూలై లోపు భూమిని గుర్తించాలని ఆదేశించారు. నైపుణ్యం కలిగిన యువతకు వసతి, రవాణా వంటి సౌకర్యాలు కలిగి ఉండాలని తెలిపారు. నైపుణ్యం లేని యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో పరిశ్రమల శాఖ అధికారులు సోనా సుహాని, చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు అధిక ఆదాయం

పాడి రైతులకు పాల ద్వారా ఆదాయం వస్తుందన్న సమాచారాన్ని రైతులకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. డివిజనల్ కో–ఆపరేటివ్ శాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో శాంతిపురం, వి.కోట, రామకుప్పం మండలాల్లో 101 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ సమీక్షలో ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్‌డీఏ పీడీ తులసి, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లోపు సమస్యలు పరిష్కరించాలి

- అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- భూ ధరల పెంపుపై అభ్యంతరాలుంటే తెలియజేయండి
- సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నమోదయ్యే ఫిర్యాదులను 48 గంటల్లోపు తప్పనిసరిగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నమోదయ్యే ఫిర్యాదుల పరిష్కారం అలసత్వం వహించకూడదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. జిల్లా నుంచి 55 మంది తమ సమస్యలను చెప్పుకున్నట్లు తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం పరిష్కారం వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీపీవో లక్ష్మి, డీఎస్‌ఓ శంకరన్, డీఎల్‌డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

భూ ధరల పెంపుపై అభ్యంతరాలున్నట్లయితే జిల్లా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తెలియజేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. జూన్ 1 నుంచి పెరగనున్న భూముల మార్కెట్ విలువల సవరణపై సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో 2020 తర్వాత భూ విలువను పెంచలేదన్నారు. మార్కెట్ విలువల సవరణ కమిటీ జేసీ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్లు, జెడ్పీ సీఈఓ సభ్యులుగా, సబ్ రిజిస్ట్రార్లు కన్వీనర్లుగా ఉంటారని తెలిపారు. జిల్లాలో మొత్తం 133 గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో మార్కెట్ విలువల సవరణ ప్రతిపాదనను ఆమోదించామన్నారు. క్షేత్రస్థాయిలో కొన్ని ప్రాంతాల్లో చదరపు అడుగు రూ.50, ఎకరా రూ.3 లక్షలు కూడా మార్కెట్ విలువ ఉందని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో తేడాలను నివేదించగా కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. నూతన ధరల సవరణను రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్, సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉంచడం జరిగిందన్నారు. తుది భూ ధరల పెంపు నివేదికను ఈనెల 30లోపు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. వాణిజ్య ప్రాంతాలు, జాతీయ రహదారులు, రూరల్ ప్రాంతాలు, రోడ్డుకు ఇరువైపుల ప్రాంతాల ఆధారంగా నూతన మార్కెట్ విలువ ప్రతిపాదన ఉంటుందన్నారు. దాదాపు 30 శాతం నుంచి కొత్త ధరల పెరుగుదల నివేదికలో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.